# స్టవ్

ఈ మధ్య యిక్కడ వర్షాలు బాగా పడ్డాయి. వర్షం పడ్డ రోజున మనకి మెలకువ రావడమూ ఆలస్యానే అవుతుంది; అందుకు తగ్గట్టుగా పాలవాడు ఆలస్యంగానే వస్తాడు. ఆరున్నర అనుకుందట శాంతాదేవి; కాని అది ఏడున్నరట.

కాఫీ తాగుతూ, 'పోనీలే, యివ్వాళ మధ్యాహ్నం హోటల్లో భోజనం చేస్తాను. అప్పుడే ఎనిమి దవుతోందా, ఇంతపనీ ముగించుకు వంట ఎక్కడ చెయ్యగలవ్ ? పని మనిషిచేత కాఫీ హోటల్నుంచి ఏదైనా టిఫిన్ తెప్పించి పెట్టు,'' అన్నాను ఆదర్శభర్తలా.

''హోటల్లో తినవలసిన ఖర్మ ఏ మొచ్చింది మీకు— అన్నపూర్ణలాటి భార్య వుండగా! నా జడా,. స్నానం తర్వాత చూసుకుంటాను. మీకు రోజూ కంటె పావుగంట ముందు వంట చేసిపెడతాను. చూస్తూవుండండి,'' అంది శాంతాదేవి.

చూస్తూవుండక చేసేదేముంది ?—ఆమె బాధపడుతుం దనుకున్నాను. కిరసనాయిలు స్టవ్ డీజెల్ యింజను లా మోత మొదలెట్టింది. నేను హాల్లో కూచుని పేపరు తిరగేస్తున్నాను. వరుణదేవుణ్ణి అరికట్టే నిమిత్తం పశ్చిమ కనుమల మీద అణుశక్తిని ఉపయోగించడం గురించి డాక్టరు అంటే

డక్టర్ చేసిన సూచన చదివి, నాలో నేను నవ్వుకుంటు న్నాను. రాత్రి తెప్పించిన వెన్న స్టవ్ మీద పెట్టినట్టుంది. వంటింట్లోనుంచి కమ్మటి వాసన వస్తోంది.

"ఇంకా కూచున్నా రేమిటి—స్నానానికి లేవక; బాయిలర్‌లో నీళ్ళు సలసల కాగి వుంటాయి ఈ పాటికి. సగం వంట అయిపోయింది. బియ్యం కుంపటిమీద పడేశాను; పప్పు మరొక కుంపటిమీద పడేశాను. స్టవ్ మీందనుంచి నెయ్యి దించాక, బీరకాయ ముక్కలు పోపులో వేస్తాను," అంటూ చదివింది శాంతాదేవి.

"ఈ సారి వెన్న మంచిదే కదూ ?"

"ఇదీ ఒక కమ్మదనమే. నెయ్యి అంటే మా వాళ్ళింట్లో నెయ్యి చెప్పాలి."

"ఒక్క నేతికే నేమిటి—అన్ని విషయాలలోనూ మీ వాళ్ళని చెప్పుకోవలసిందే," అంటూ పేపరు పక్కన పడేసి, స్నానాల గదివైపుగా నడిచాను.

అటు వంటయింటివైపు చూడనుగదా యింకేముంది ! స్టవ్ మంట రెండు అడుగుల ఎత్తుకి లేచింది. స్టవ్ అడుగు నుంచి పైదాకా ఒకటే మంట. నేతి గిన్నెలోని నెయ్యి కూడా అంటుకున్నట్టుంది.

ఒక్క అంగలో వంటింటివైపు దూకి, స్టవ్ పక్కనే పడివున్న పటకారుతో నేతిపాత్రని మొండి ధైర్యంతో

క్రిందకి దించాను. అప్పుడు ఒక మంట రెండుమంటలుగా మారింది. పనిమనిషి గిన్నెలు తోమడానికని ఒక మూలగా చెక్కపెట్లో వుంచుకున్న యిసుకని స్టవ్ మీద కొట్టాను. పెట్లోవున్న యిసుకంతా పోశానుగాని మంట ఆరలేదు. కాని వుధృతం తగ్గింది. చూరుగానీ, చుట్టుపక్కల ఏమైనా వస్తువులుగానీ అంటుకున్నాయేమో చూశాను. అదృష్టవశాత్తూ అలాటిదేమీ జరగలేదు. నేతి పాత్రలో చెంబుడు నీళ్ళు దిమ్మరించే టప్పటికి ఆ మంట ఆగింది. స్టవ్ పీకె దగ్గర పటకారుతో పట్టుకు, ఆరు బయటికి తీసుకువచ్చి, పంపుకింద పెట్టాను. ఇంక మంట ఎవరికోసం ఆరుతుంది? చచ్చినట్టు.

శాంతాదేవి స్తంభానికి ఆనుకు, విస్తుపోయి, కళ్ళు రెండూ వొప్పగించి చూస్తోంది. నీళ్ళకుండ నెత్తిమీద క్రుండట మంటారే—అలావుంది ఆమెస్థితి. ఓదార్పుమాటలు చెప్పాను.

"ఇందులో నీదేముంది? ఏదో ప్రమాదవశాత్తూ అంటుకుంది. రిపేరర్ దగ్గరకి పంపితేగాని ఆ స్టవ్ ఎలానూ బాగుపడదు. పక్కవీధిలో ఒక రిపేరర్ ఉన్నాడు. మన పనిమనిషిని వెళ్ళి పిల్చుకు రమ్మను," అన్నాను ఆమె భుజం మీద చెయ్యివేసి.

"వెధవ స్టవ్! ఇంత ముంచుకొస్తుందని అనుకోలేదు. ఎప్పుడూ ఎరగం యిలాటిది. గాలి కూడా ఎక్కువ కొట్ట లేదు. మండుతూ మండుతూ ఎంత ముప్పు తెచ్చిపెట్టింది!"

"పోనీలేగాని, ఒక కప్పు వోవల్టీన్ ఎలక్ట్రిక్ స్టవ్‌మీద కాచిపెట్టు. ఈ పూట మనకి హోటల్ మెతుకులు రాసి వున్నాయి. విధిని తప్పించడం మనతరం గాదు," అన్నాను శాంతాదేవిని సమాధాన పరుస్తూ.

"ఎంత అదృష్ట వంతులం. యిల్లంటుకుంటే యింకే మన్నావుంది! ఇవ్వాళ లేచిన వేళా విశేషం మంచిది."

"పొద్దున్నే ఎవరిమొహం చూశావో?" అన్నాను నవ్వుతూ.

"మీ మొహమే!" అంది కన్నీటిని వెలిగించే వెన్నెల కిరణంలా.

* * * *

ఆ సాయింత్రం రిపేరర్ వచ్చాడు. మా స్టవ్‌కి సంభ వించిన ఆపద చెప్పాం. బర్నరూ, పంపూ, మెడా వేటికవి వూడపీకి, ఒక్కొక్కటే కిందామీదా పరిశీలించి, మళ్ళీ అవన్నీ యథాప్రకారం బిగించి "నాలుగు రూపాయ లవు తుంది," అన్నాడు.

"మిస్టేక్ ఏమిటి?" అని ప్రశ్నించింది శాంతాదేవి.

"అంతా క్లీన్ చెయ్యాలి. గాజ్ తీసి మళ్ళీ వెయ్యాలి. చాలా పని వుంది. అయిదురూపాయ లడుగుదా మనుకొని, అమ్మగారు బేరమాడరుగదా అని నాలుగు రూపాయలు అడిగాను," అన్నాడు రిపేరర్.

నేను దూరంనుంచి సంభాషణ అంతా వింటూనే వున్నాను. వాళ్ళూ వాళ్ళూ చూసుకుంటారుగదా అని కల్పించుకోలేదు. శాంతాదేవి పావుగంట బేరమాడిన మీదట మూడు రూపాయిలకి బాగుచెయ్యడానికి వొప్పుకున్నాడు అతను.

"స్టవ్ బాగుపడివచ్చినా, దానిమీద వండటానికి యింకా కొన్నాళ్ళవరకూ భయంగానే ఉంటుంది. వాడినా వాడకపోయినా వస్తువుంటే మంచిది," అంది శాంతాదేవి, రిపేరర్ స్టవ్ పట్టుకెళ్ళిన తర్వాత.

స్టవ్ మీద నాకు కోపంలేదు. ఏదో ఒక సారి ప్రమాదం సంభవించిందిగాని, ఎప్పుడూ జరుగుతుందా? అదీగాక, నూనె, నెయ్యి మొదలైనవి స్టవ్ మీద పెట్టినప్పుడు దగ్గిరే వుండాలిగాని, యిటూ అటూ తిరగకూడదని శాంతకి తెలియదని నాకేం తెలుసు? అయిందేదో అయిపోయిందని సరిపెట్టుకున్నాను.

మర్నాడు సాయింత్రం రిపేరర్ స్టవ్ బాగుచేసి పట్టుకు వచ్చాడు. బాగా వెలుగుతున్నదీ లేనిదీ అతన్నే వెలిగించి చూపించమన్నాం.

"స్టవ్‌లో కిరసనాయిలు లేదు," అన్నాడు రిపేరర్.

శాంతాదేవి లోపలికి వెళ్ళి, సీసాతో కిరసనాయిలు తీసుకువచ్చింది. సీసాడు నూనె పీపాలాటి పొట్టలో పోసుకుంది స్టవ్.

"స్పిరిట్ కాన్," అన్నాడు రిపేరర్.

"మేము స్పిరిట్ పోసి వెలిగించం. గుడ్డపీలిక కిరసనాయి లులో ముంచి, అది వెలిగించి, స్టవ్ చేస్తాం," అంది శాంతాదేవి.

"అందుకే స్టవ్‌లు తొందరగా చెడిపోతాయి, మసిబాగా పడుతుంది. ఆ మసివల్లనే స్టవ్ సరిగ్గా మండదు. స్టవ్ పిన్ యిప్పించండి" అని అడిగాడు రిపేరర్.

ఈ అందించడం శాంతాదేవికి బావుండలేదు. కాని తప్పుతుందా—ఎవరి పని ?

రిపేరర్ స్టవ్‌ని వెలిగించాడు. రెండు రైలింజనులు ఒకే సారి కూసినట్టు మొదలెట్టింది.

"హోరు మునుపటికంటె ఎక్కువయిందే—చెవులు చిల్లులు పడుతున్నాయి, అంది శాంతాదేవి, నన్నూ రిపే రర్నీ వుద్దేశిస్తూ.

"ఆ హోరు తగ్గించేందుకు మార్గంలేదూ ?" అని అడి గాను రిపేరర్ని.

"లేకేం, సార్, సైలెంట్ బర్నర్ వేసుకుంటే సరి," అన్నాడు ఉత్సాహంగా.

"అది ఎంతవుతుంది ?" అని అడిగింది శాంతాదేవి.

"ఎంతండి, అయిదు రూపాయిలు. ఆ సైలెంట్ బర్నర్ వేశామా స్టవ్ యింట్లో వున్నట్టే తెలియదు,"

శాంతాదేవి నా వంక చూసింది. ఇప్పుడు కాదన్నట్టు మొహం పెట్టాను.

* * * *

నాలుగైదు రోజులపాటు శాంతాదేవి స్టవ్‌ని ఒక మూలగా వుంచిందిగాని ఆపైని మళ్ళీ వాడటం మొదలెట్టింది. వాడకుండా ఎలా కుదురుతుంది ? ఎలక్ట్రిక్ స్టవ్ వుందిగాని దానిమీద కాఫీనీళ్ళు పడెయ్యడానికే వీలవుతుంది. అంతే గాక, దానిమీద పాత్రలు పెట్టేటప్పుడూ జాగర్తగా వుండాలి. ఏమాత్రం అశ్రద్ధగావున్నా, పాత్ర కాయిల్‌కి తగిలి షాక్ కొట్టవచ్చు. కిరసనాయిలు మంటే అనుకుంటే, అంతకంటె ప్రమాదం యిది ! ఘట్టిగా ఆలోచిస్తే ఏది ప్రమాదం కాదు గనక ! జీవితమే మహా ప్రమాదం.

ఈ మాదిరి తత్వచింతనతోటే, పదిరోజులు పోయాక, మళ్ళీ స్టవ్ వాడటం మొదలెట్టింది శాంత. సరిగ్గా వారం రోజులు వాడామో లేదో రిపేరర్ కావాలంటూ మొండికేసింది ఆ స్టవ్.

రిపేరర్ వచ్చీ రావడంతోటే అడిగాడు "స్పిరిట్ వాడుతున్నారా ?"

ఒక మూల ప్రొహిబిషన్ వుండగా స్పిరిట్ బాటిల్ ఎక్కడ దొరికేడుస్తుంది !

"స్పిరిట్ ఎక్కడా దొరకలేదు," అంది శాంతాదేవి.

"మూడు రూపాయలు యిలా పడెయ్యండి—నేను తెచ్చిపెడతాను."

శాంతాదేవి వెంటనే బీరువా తెరిచి మూడు రూపాయలు పట్టుకొచ్చి, అతని చేతిలో పెట్టివుండవలసిందే. కాని, ఎంచేతనో ఆగింది. స్పిరిట్ బాటిల్‌కి డబ్బిస్తే నేను తెచ్చిపెడతాను," అన్నాడు రిపేరర్.

"స్పిరిట్ సంగతి తర్వాత చూసుకుందాం ప్రస్తుతం ఈ స్టవ్‌కి వచ్చిన జబ్బేమిటి?" అన్నాను.

"అదే, సార్. మసి అంతా గాజ్‌కిపులుముకుపోయింది. అంతా మళ్ళీ క్లీన్ చెయ్యాలి. పనిలో పని, సైలెంట్ బర్నర్ కూడా వేసేసుకుంటే..."

"సరే" అన్నాం యిద్దరమూ.

ఒకొక్కప్పుడు ఏమీ ఆలోచక సరే అంటామే అలా అన్నాం.

*　　*　　*　　*

మర్నాడు సాయంత్రం రిపేరర్ స్టవ్ పట్టుకొచ్చేవేళ అయింది.

"మీకు తెలిసిన వాళ్ళ నెవరినయినా అడిగి స్పిరిట్ బాటిల్ పట్టుకురాకపోతే ఎలా?" అంది శాంతాదేవి.

"ఇన్నాళ్ళబట్టీ ఎలా వెలిగిస్తున్నామో యిప్పుడూ అలాగే వెలిగిద్దాం," అన్నాను.

"ఆ లోపలంతా మసిపుట్టుకుపోతుందన్నాడుగా రిపేరర్."

"వాడి మొహం" అంటూండగానే అతను ప్రత్యక్షమయాడు.

పాపం—అతను మంచివాడు చిన్న సీసాలో కొంచెం స్పిరిట్ పోసి పట్టుకొచ్చాడు మాకోసం. మూడు రూపాయిలు యిస్తే పెద్ద సీసా తెచ్చిపెడతానన్నాడు. ఆ తెచ్చినది నాలుగణాల ఖరీదు గల స్పిరిట్ అన్నాడు.

ఏమయితేనేం, డిమాన్‌స్ట్రేషన్ ప్రారంభ మయింది. విజయవంతమైన ప్రదర్శన. సైలెంట్ బర్నర్ మండుతున్నప్పుడు ధ్వనే లేదు-హాయిగా, చక్కగా, వినసొంపుగా ఉంది.

అయిదు రూపాయిలు సైలెంట్ బర్నర్‌కీ, రూపాయిన్నర క్లీనింగ్‌కి నాలుగణాలు స్పిరిట్‌కీ, చెప్పిన వేళకి తీసుకొచ్చినందుకు నాలుగణాలు—మొత్తం ఏడు రూపాయిలు యిచ్చి పంపించాం.

మర్నాడు పొద్దున్న శాంతాదేవి స్టవ్ వెలిగించబోయేటప్పటికి అది ససేమిరా వెలగనంది. నేనుకూడా స్టవ్‌తో కాసేపు యుద్ధం చేశాను-కాని ప్రయోజనం లేకపోయింది. ఏం చేస్తాం—పనిమనిషిని రిపేరర్ కోసం పంపాం. అతని పాపు తొమ్మిదిన్నరయితేగాని తెరవరట.

స్టవ్‌ని పట్టుకెళ్ళేందుకు అతను సాయంత్రం వేళ వచ్చాడు.

"ఇదేమీ బాగాలేదు. ఏదో జాగ్రత్తగా బాగు చేస్తావు గదా అని యిస్తే యిదా ?" అని ఆ రిపేరర్‌ని కాస్త కసిరాను.

"రాత్రి మీ ముందరే వెలిగించాను కదా! మళ్ళీ వెలిగిస్తాను చూడండి," అన్నాడు రిపేరర్.

అగ్గి పెట్టె ఖాళీ అయింది; అతను తెచ్చిన స్పిరిట్ సీసా ఖర్చు అయింద; కాని సీసాడు కిరసనాయిలు పొట్టలో పోసుకున్న స్టవ్ వెలగనుమట్టుకు వెలగలేదు.

రిపేరర్‌కి మొహం చెల్లలేదు.

"ఇన్నేళ్ళబట్టీ యిన్ని స్టవ్‌లు రిపేరు చేస్తున్నానుగాని యింత మొండి స్టవ్‌ని ఎక్కడా చూడలేదు," అన్నాడు రిపేరర్.

మా స్టవ్‌ని మొండి స్టవ్ అన్నందుకు శాంతాదేవి కజ్జా వేసుకుంటుందేమో అనుకున్నానుగాని ఏ కళని వుందో వూరుకుంది.

స్టవ్ పుచ్చుకు వెళ్ళిపోయాడు రిపేరర్. అతను సంతోష వదనంతో మర్నాడు సాయంత్రం స్టవ్ పట్టుకొచ్చి, డిమాన్‌స్ట్రేషన్ ప్రారంభించాడు.

"దీనికి సైలెంట్ బర్నర్ పనిచెయ్యదు. నా దగ్గరవున్న మామూలు బర్నరేవేశాను" అని సంజాయిషీ చెప్తూకుంటూ స్టవ్ వెలిగించాడు. స్టవ్ వెలిగిందిగాని మూడవవంతు మంట వచ్చింది; మిగతా రెండువంతులూ మంటాలేదు, గింటా

లేదు; గ్రహణం పట్టినట్టువుంది. ఎంతసేపు పిన్ చేసినా లాభం లేకపోయింది.

ఈ సారి అతనికి తల కొట్టేసినట్టయింది. ముఖమెత్తి మావంక చూడలేక పోయాడు. కాయకల్ప చికిత్సకూడా పని చెయ్యనంతటి ముసిలిదై పోయిందేమో మా స్టవ్.

నాలుగు రోజులపాటు అతను మా కంట పడలేదు. అయిదో రోజున పనిమనిషిని పంపించేటప్పటికి స్టవ్వూ, స్టవ్‌తో పాటు అయిదు రూపాయలూ పని మనిషి చేతికిచ్చి పంపించాడు. మా స్టవ్‌ని అతను రిపేరు చెయ్యలేడట.

"అతని కష్టం మనమెందుకు వుంచుకోవాలి ?" అని శాంతాదేవి మాట వరసకి అన్నదేగాని, ఆ అయిదు రూపాయిలూ వెనక్కి పంపినట్టు తోచదు.

ఈ సారి తన పుట్టినపండగకి చీరె గీరె వొద్దు—కొత్త స్టవ్ ప్రజెంటు చెయ్యమని అడుగుతుందట శాంతాదేవి వాళ్ళ వాళ్ళని,

(సమాప్తి.)